
సాక్షి కర్నూలు

గురువారం । 22 । మే । 2025



అలరించిన నాట్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం నిత్యకళావేదికపై నంద్యాలకు చెందిన సాయినృత్య కళాశాల వారు భరతనాట్యం ప్రదర్శించారు.



సాక్షి గణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



ముందే వచ్చిన వర్షాకాలం!

ఈ సారి వానాకాలం ముందే వచ్చినట్లుంది. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. తుంగభద్ర నదిలో వరదనీరు ప్రవహిస్తోంది. 8లో ▸

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు



జొన్నగిరి పోలీస్ స్టేషన్ ప్రైభాగం పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

తుగ్గలి/మద్దికెర: నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. జొన్నగిరి, తుగ్గలి, మద్దికెర పోలీస్ స్టేషన్లను బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టేషన్ల పరిధిలోని పెండింగ్ కేసులపై ఆరా తీశారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటరామయ్య, రూరల్ సీఐ పులిశేఖర్, ఎస్‌ఐలు మల్లికార్జున, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

వైద్య మందులపై తప్పుడు ప్రకటనలు ఇస్తే చర్యలు

- ఔషధ నియంత్రణ శాఖ ఏడీ రమాదేవి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలను తప్పుదోవ పట్టించేలా వైద్య మందుల వినియోగంపై ప్రకటనలు ఇస్తే చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ శాఖ ఏడీ రమాదేవి హెచ్చరించారు. బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ అధిక బరువు తగ్గిస్తామని, పలు రకాల వ్యాధులు నయం చేస్తామని సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చిన పలు సంస్థలపై ఇటీవల కేసులు నమోదు చేశామన్నారు. అందులో ఇండోర్‌కు చెందిన ఈమాన్ డ్రగ్స్, నందికొట్కూరుకు చెందిన వెంకటేశ్వరరెడ్డి, బనగానపల్లి మండలం బానుముక్కల గ్రామంలోని పక్షవాత నివారణ కేంద్రాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కర్నూలు నగరంలోని గణేష్‌నగర్ సమీపంలోని పార్థగ్రాండ్‌లో ఫిజీషియన్ శాంపిల్స్ అక్రమంగా నిల్వ ఉంచుకున్న ఉదయ్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఇతనిపై ఇప్పటికే పలుమార్లు కేసులు ఉన్నట్లు తెలిపారు. అలాగే నంద్యాలలో శ్రీ వైష్ణవి మెడికల్స్‌పై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి మత్తును కలిగించే మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): సీ క్యాంప్‌లోని ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. హాస్టల్‌లో 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. నిబంధనల మేరకు వంద మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నంబర్ 08518-277864ను సంప్రదించాలన్నారు.

ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఏపీ ఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కర్నూలులో ఏర్పాటు చేసిన తొమ్మిది కేంద్రాల్లో మొదటి రోజున ఉదయం 1,247 మందికి గాను 1,177 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,255 మందికి గాను 1,182 మంది హాజరయ్యారు. నంద్యాలలోని మూడు కేంద్రాల్లో మొదటి రోజు ఉదయం 544 మందికి గానూ 520 మంది, మధ్యాహ్నం 543 మందికి గానూ 523 మంది హాజరయ్యారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు.

తవ్వారు.. వదిలేశారు!



రోడ్డులో ఏర్పడిన గుంత

ఆదోని అర్బన్: పట్టణంలోని బసాపురం రోడ్డు మార్కెట్‌యార్డు సమీపంలో చిన్న వర్షానికి పెద్దదిగా గుంత మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. గత నెలలో ఈ రోడ్డులో పైపులైన్ లీకేజీ అయ్యి గుంత తవ్వారు. ఆ గుంతను అసంపూర్తిగా పూడ్చారు. దీంతో ఆ రోడ్డులో మార్కెట్ యార్డు, పత్తి పరిశ్రమలకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజుల లారీ గుంతలో ఇరుక్కుపోవడంతో ప్రొక్లెయిన్‌ను తీసుకొచ్చి బయటకు తీశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత తెల్లబోతోంది!

బీటీ పత్తి విత్తనాలకు సొంత ధ్రువీకరణ

- కంపెనీల తీరుపై వ్యవసాయ శాఖ మీనమేషాలు
- కో–మార్కెటింగ్ పేరిట బీటీ పత్తి విత్తన వ్యాపారం
- సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్ల పేరుతో దందా
- తరచూ విత్తనం కారణంగా దెబ్బతింటున్న పంట
- గతంలో నిండా ముంచిన 'కావేరి–జాదు'
- బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్లు బ్లాక్ విక్రయాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు, మూడేళ్ల క్రితం కావేరి–జాదు రకం బీటీ పత్తి విత్తనాలు రైతులను నిండా ముంచేశాయి. 17 మండలాల్లో దాదాపు 2,400 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా.. 1,899 మంది రైతులు నష్టపోయారు. ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు నష్టం జరిగిందని, క్వింటాకు రూ.7,300 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు ఇచ్చింది. దీనిపై కావేరి కంపెనీ హైకోర్టును ఆశ్రయించగా వ్యవసాయ శాఖ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలనే తీర్పు వచ్చింది. ఆ మేరకు అప్పీలు చేసుకోగా.. సుదీర్ఘ విచారణ తర్వాత పరిహారాన్ని కొంతమేర తగ్గిస్తూ జడ్జిమెంట్ వచ్చింది. అయితే ఆ ప్రకారం కూడా కంపెనీ రైతులకు పరిహారం చెల్లించకపోవడం గమనార్హం.

... కంపెనీలపై వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లేకపోవడం .. విత్తన ధ్రువీకరణ కంపెనీలే సొంతంగా చేసుకోవడం కారణంగా పంట దెబ్బ తిన్న సమయంలో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతున్నారు.



వెల్దుర్తిలో పట్టుబడిన నకిలీ బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రం మొత్తం మీద పత్తి 5,28,361 హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే దాదాపు 50 శాతం వరకు సాగవుతోంది. కర్నూలు జిల్లాలో 2,34,409 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 18,827 హెక్టార్లలో పత్తి సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల దశాబ్దాలుగా పత్తి రైతుల పాలిట తెల్ల బంగారం అవుతోంది. ఇక్కడ హైబ్రిడ్ పత్తి, బీటీ పత్తి విత్తనోత్పత్తి కూడా ఎక్కువగా ఉంటోంది. విత్తన కంపెనీల దృష్టి కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాపైనే ఉండటం గమనార్హం. రాష్ట్రం మొత్తం మీద జరిగే మార్కెటింగ్ ఒక ఎత్తు అయితే, ఇక్కడి మార్కెటింగ్ మరో ఎత్తు. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పత్తి సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఇక్కడ కో–మార్కెటింగ్, సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్.. ఇలా రకరకాల పేర్లతో పత్తి విత్తన ప్యాకెట్లను అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏది ఒరిజినల్, ఏది నకిలీ తెలుసుకోవడం రైతులకు కష్టంగా మారింది. వాస్తవానికి కో–మార్కెటింగ్ అనేది లేదు. కానీ అనధికారికంగా సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్ పేర్లతో రైతులను దగా చేస్తున్నా వ్యవసాయ శాఖ చేష్టలుడిగి చూస్తోంది. జిల్లాలో 250 కంపెనీలు దాదాపు 1000 దాకా బీటీ పత్తి విత్తన రకాలను మార్కెట్‌లోకి విడుదల చేయడం గమనార్హం.

పంట దెబ్బతింటే దేవుడే దిక్కు!

పత్తి విత్తన నాణ్యతపై వ్యవసాయ శాఖకు ఎలాంటి సంబంధం లేదు. ఆయా కంపెనీలే సొంతంగా ధ్రువీకరించుకుంటున్నాయి. ఈ కారణంగా పంట దెబ్బతింటే ఆయా కంపెనీలదే పూర్తి బాధ్యత. అయితే పంట దెబ్బతిన్న సమయంలో వాతావరణ పరిస్థితులను కారణంగా చూపుతూ కంపెనీలు చేతులు దులుపుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పంట దెబ్బతిన్నప్పుడు పరిహారం ఇవ్వకుండా తప్పించుకునేందుకు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో కూడా ఒక పేరొందిన కంపెనీ విత్తనంతో సాగు చేసిన పత్తి పలు చోట్ల దెబ్బతినింది. అయితే ఆ కంపెనీ వ్యవసాయ యంత్రాంగాన్ని ముడుపులతో లోబరుచుకొని ఇతర కారణాలతో పంట దెబ్బతిన్నట్లు రిపోర్టు ఇవ్వడం గమనార్హం.

బ్లాక్‌లో పత్తి విత్తనాలు

ఈ సారి పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. వర్షాలు పడుతున్నందున ఈ నెల చివరి వారం నుంచే పత్తి విత్తనాలు నాటుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వందల కంపెనీలు, రకాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా.. వీటికి అనుమతులు ఉన్నాయా, లేదా అని వ్యవసాయశాఖ పటించుకున్న పాపాన పోవడంలేదు. ప్రధానంగా రెండు కంపెనీల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోకి ఒకవైపు తెలంగాణ నుంచి, మరోవైపు కర్ణాటక నుంచి అనధికార పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాలోకి వెల్లువెత్తుతున్నాయి. పశ్చిమ ప్రాంతంలో పత్తి లూజు విత్తనాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో నకిలీలు, అనుమతి లేని విత్తనాలను జోరుగా అమ్మకాలు సాగిస్తున్నా వ్యవసాయ శాఖ నుంచి స్పందన కరువైంది.

హెచ్‌టీ పత్తి సాగు ప్రమాదకరం

పత్తిలో హెచ్‌టీ విత్తనాలకు కేంద్రం ఇంతవరకు అనుమతి ఇవ్వలేదు. పత్తిలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. హెచ్‌టీ పత్తిలో కలుపు నివారణకు గ్లైఫోసేట్ మందును పిచికారి చేస్తే కలుపు నాశనం అవుతుంది తప్ప.. పత్తి పంటకు ఏమీ కాదు. హెర్బిసైడ్ టాలరెంట్(హెచ్‌టీ) బీటీ పత్తి విత్తనాలు జీవవైవిధ్యానికి ప్రమాదకరమనే ఉద్దేశంతో కేంద్రం వీటికి అనుమతివ్వలేదు. అయినప్పటికీ కొంతమంది రైతులు హెచ్‌టీ పత్తి సాగు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ వచ్చి హెచ్‌టీ పత్తి విత్తనాలను గుర్తించేందుకు తనిఖీలు జరిపి పరీక్షలు నిర్వహించారు. అయితే తూతూమంత్రంగా పరీక్షలు నిర్వహించారనే చర్చ జరుగుతోంది.

➤ బీటీ టెక్నాలజీని మ్యాన్‌శ్యాంటో కంపెనీ తెచ్చింది. బీటీ టెక్నాలజీని పొంది విత్తనోత్పత్తి, ప్యాకింగ్, మార్కెటింగ్ చేసుకోవాలంటే మ్యాన్‌శ్యాంటో నుంచి లైసెన్స్ తీసుకోవడం తప్పనిసరి. ఈ కంపెనీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో 45 కంపెనీలకు లైసెన్‌లు ఉండగా.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకే ఒక్క కంపెనీకి మాత్రమే లైసెన్స్ ఉంది.

➤ కో–మార్కెటింగ్ పేరుతో ఉమ్మడి జిల్లాలో 10 వరకు కంపెనీలు ఉండగా.. సిస్టర్ కన్సల్టెన్సీ, సబ్ డీలర్స్ పేరుతో వందలాది కంపెనీల బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల మార్కెటింగ్‌లో నిమగ్నమయ్యాయి.

➤ 450 గ్రాముల బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.901. నూజివీడు కంపెనీ రేవంత్ రకం ప్యాకెట్లను రూ.1,300 పైబడిన ధరతో అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

➤ యుఎస్ అగ్రీ కంపెనీకి చెందిన 7067 రకాన్ని రూ.1,200 వరకు బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ప్రగతి.. వెనుక'బడి'



ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పూర్తికాని అదనపు తరగతి గది

- అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణాలు
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో పనులు ఆగిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాడు–నేడు పనులు చివరి దశలో ఉన్నా పూర్తి చేయలేకపోయారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు ఇచ్చారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అదనపు తరగతి గదులను పనులు పూర్తి చేయలేకపోయింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కార్ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులు నేలపైన సాగే చదువులకు స్వస్తి పలికారు. డిజిటల్ బాటలో చదివే బాట పట్టారు. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక గురుకుల పాఠశాలలు మొత్తం 130 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 30,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు– నేడులో భాగంగా గత ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులను చేపట్టింది. ఒక్కొక్క గది నిర్మాణానికి రూ.12 లక్షలు చొప్పున 38 పాఠశాలల్లో 162 అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వంలో పరుగులు పెట్టిన పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక అర్ధాంతరంగా నిలచిపోయాయి. దీంతో ఏమి చేయాలో తెలియక ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ఉన్న తరగతి గదుల్లోనే విద్యార్థులను కూర్చోబెట్టి విద్యను అందిస్తున్నారు. కొన్ని చోట్ల వరండాలోనూ, చెట్ల కింద విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది.

ఇదీ దుస్థితి

➡ ఆదోని పట్టణంలోని ఆర్అర్ లేబర్ కాలనీలో పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూ మోమోరియల్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

➡ కల్లుబావిలోని ప్రాథమిక పాఠశాల, డణాపురంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విరుపాపురం, పెద్దహరివాణం, పెద్దతుంబళం, ఆరెకల్లు వంటి పలు పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి.



కల్లుబావి పురపాలక ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల దుస్థితి


➡ ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి.

➡ కిటికీలు, తలుపులు, ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్ వంటి పనులను పూర్తి చేస్తే వినియోగంలోకి తీసుకురావచ్చు.

ఒక్కపైసా కూడా ఇవ్వలేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్న నాడు– నేడు అభివృద్ధి పనులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఆదోని పట్టణంలోని అర్అర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో 960 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు గదులు ఉన్నాయి. నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. అలాగే నెహ్రూమోమోరియల్ ఉన్నత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గదులు పూర్తిగాక అసంపూర్తిగా ఉండడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే కొంత డబ్బులు వెచ్చించి తరగతి గదులు కీటికీలు, తలుపులు ఫ్లోరింగ్ వంటి పనులను చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు.

నిధుల కోసం ఇండెంట్ పెట్టాం



అదనపు తరగతి గదుల పనులు మధ్యలో ఆగిపోయాయి. చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గదుల నిర్మాణాలపై అధికారులకు ఇండెంట్ పెట్టాం. ఒక వేళ ప్రభుత్వం నిధులను విడుల చేస్తే పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతాం.

– శ్రీనివాసులు మండల విద్యాధికారి–2 ఆదోని

మండలాలకు ప్రత్యేకాధికారులు వెళ్లరా?

కర్నూలు(సెంట్రల్): మండలాలకు ప్రత్యేకాధికారులు వెళ్లరా అంటూ కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రశ్నించారు. తమకు కేటాయించిన మండలం నుంచే వీడియో కాన్ఫరెన్స్‌లకు ప్రత్యేకాధికారులు హాజరు కావాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మండలాల ప్రత్యేకాధికారులతో బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ.. మండలాల ప్రత్యేకాధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలన్నారు. నందవరం మండలం ప్రత్యేకాధికారిగా నియమితులైన పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రెండు నెలల నుంచి ఒక్కసారి కూడా వెళ్లకపోవడంతో ఆమెకు సంజాయిషీ నోటీసు ఇవ్వాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టాలి

జిల్లాలోని పరిశ్రమల్లో అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్‌ను నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్‌ను డ్రోన్లతో పర్యవేక్షించే అంశంపై పరిశీలన చేయాలని ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డికి సూచించారు.

ప్రభుత్వ తీరు దారుణం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

- కలెక్టరేట్ ఎదుట ఎండీయూ ఆపరేటర్ల ధర్నా

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇంటివద్దనే రేషన్ సరుకులు అందిస్తూ.. నిరుద్యోగులకు ఉపాధి అందిస్తూ ఉపయుక్తంగా ఉన్న ఎండీయూ వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని ఆపరేటర్లు, హెల్పర్లు అన్నారు. కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న కోపంతో తమ కడుపులు కొడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎండీయూ ఆపరేటర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తమకు జీవనాధారమైన ఎండీయూ వాహనాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్లు అక్బర్‌వలి, కేశవ్, మహ్మద్‌రఫీ, వీరేష్, శీను, మద్దిలేటి మాట్లాడుతూ.. రేషన్ సరుకుల డెలివరీ కోసం ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2027 జనవరి వరకు ఎండీయూ వాహనాలను కొనసాగించాలన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నెలకు రూ.21 వేలు ఇచ్చేదని, ఇందులో రూ.3 వేలు బండి ఈఎంఐ పోను మిగిలిన రూ. 18 వేలలో రూ. 5 వేలు హెల్పర్‌కు, మరో రూ.3 వేలు పెట్రోలు, ఇతర నిర్వహణ చార్జీలకు ఖర్చు అయి రూ.10 వేలు మిగిలేదన్నారు. దానితో తాము ఉపాధి పొంది కుటుంబాలను పోషించుకునే వారమని తెలిపారు. వాటిని రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమతో ప్రభుత్వం చేసుకున్న గడువు వరకు కొనసాగించాలని, ఆ తర్వాత ఇతర ప్రభుత్వ శాఖల్లో తమకు ఉపాధిని చూపాలన్నారు. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామన్నారు.

శ్రీశైలంలో తొట్టెల నిర్మాణం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని పైకప్పుల నుంచి లీకేజీ అరికట్టేందుకు దేవస్థానం చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం సున్నపు, జాజికాయ, బెల్లం తదితర వస్తువుల మిశ్రమాన్ని కలుపుకునేందుకు ఆలయంలో పలు ప్రదేశాలలో తొట్లెల నిర్మాణం చేపడుతున్నారు. పూణేలోని ఉత్తరాదేవి చారిటబుల్‌ట్రస్ట్ వారితో పురాతన పరిరక్షణ పద్ధతులను అనుసరించి ఆలయంలో పైకప్పుల నుంచి లీకేజీని అరికట్టే పనులు చేపడుతున్నారు. దేవాలయాల ప్రాంగణంలో పరిరక్షణ పనులు చేపట్టడం శుభపరిణామమని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆర్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గతంలో (1965–70, 2013–14 సంవత్సరాల్లో) శ్రీశైల ఆలయంలో స్థానభ్రంశం చెందిన నిర్మాణాలను యథాతథం చేసిన తరువాత పరిరక్షణ పనులు చేపట్టాలని కోరారు.



శ్రీశైల ఆలయంలో సున్నపు మిశ్రమాన్ని కలుపుకునేందుకు ఏర్పాటు చేసిన తొట్టె

22 నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ లైన్ నన్నూరు నుంచి ఏపీ కార్బైడ్ వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 22 నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. పాత కండక్టర్ స్థానంలో కొత్తది వేస్తుండటంతో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగవచ్చని తెలిపారు. కండక్టర్ మార్చడంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే సహకరించాలని వినియోగదారులను కోరారు.

యోగా..మంచిదేగా!

కర్నూలు నగరంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం జిల్లా అధికారులు యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, నగర మేయర్ బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

రెండు మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాణ్యం, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గౌరవ చైర్మన్లుగా సంబంధిత నియోజక వర్గాల ఎమ్మెల్యేలు వ్యవహరిస్తారు. పాణ్యం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంగజల గీత, వైస్ చైర్మన్‌గా యల్లంపల్లి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా ఏ.లక్ష్మిప్రసన్న, ఏ.ఉషారాణి, డి.వెంకటరమణారెడ్డి, జి.ఈశ్వరమ్మ, కే.ప్రభావతమ్మ, రాజు నాయక్, షణ్ముఖరెడ్డి, సుధాకర్, పద్మలీల, ఎద్దుల జయమ్మ, నంద్యాల రవికుమార్, ఎస్.ప్రభాకర్, మూల రామయంద్రారెడ్డి నియమితులయ్యారు. నందికొట్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వీరం ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా వై.సుధాకర్ సభ్యులుగా బి,మహేశ్వరి, తెలుగు పెద్దదస్తగిరి, విజయలక్ష్మి, జీవన సుకన్య, మేకల రాములమ్మ,మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, పి.మల్లేశ్వరీ, ఆర్.చయలీల, సంపత్ కుమార్, నిర్మల, బి,రవితేజ, షేక్ రేస్మా ప్రవీన్, మన్సూర్‌బాష నియమితులయ్యారు.

1,217 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: జిల్లాలోని 80 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 1,217 విద్యార్థులు మంది గైర్హాజరయ్యారు. డీఈఓ కె. శామ్యూల్ ఐదు పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్ర భూషణ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులుగా కె రవికుమార్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన రవికుమార్‌ను జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించారు. రవికుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, తనకు సముచిత స్థానం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

రేపు జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఈనెల 23న జాతీయ స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించే పోటీలలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు అదే రోజు ఉదయం 7 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9502653201, 9949865259, 9398283631 నంబర్లను సంప్రదించాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు నగరం ఎస్.నాగప్ప వీధిలో నివాసముంటున్న బొల్లెద్దుల సత్యనారాయణ (45) మోతాదుకు మించి మాత్రలు మింగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. సత్యనారాయణ .. డిస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈనెల 19వ తేదీ మోతాదుకు మించి మాత్రలు మింగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందే వచ్చిన వర్షాకాలం!

- జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
- గూడూరులో 49.2 మిమీ వర్షపాతం నమోదు
- తగ్గిన ఉష్ణోగ్రతలు



కోసిగి మండలం కందుకూరు వద్ద ఆర్డీఎస్ ఆనకట్టపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ సారి వానాకాలం ముందే వచ్చినట్లుంది. కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు హాలహరివ్, ఆస్పరి, దేవనకొండ, చిప్పగిరి, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. గూడూరులో అత్యధికంగా 49.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కోడుమూరులో 47.6, కల్లూరులో 38.8, హొళగుందలో 19.4, గోనెగండ్లలో 16.4, సీ.బెళగల్‌లో 13.4, కౌతాళంలో 12.6, ఓర్వకల్లులో 12.4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 11 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెలకు సంబంధించి 21వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 27.2 మి.మీ ఉండగా... 77.9 మి.మీ వర్షపాతం నమోదైంది. హంద్రీకి ఒక మోస్తరుగా నీరు వచ్చింది. కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. గరిష్ఠంగా 36 డిగ్రీల వరకు మాత్రమే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల రానున్న రెండు, మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

17 వేల క్యూసెక్కుల వరదనీరు

సి.బెళగల్: కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర నదిలో దాదాపు 17 వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నది పూర్తి స్థాయిలో రెండు దడులను తాకుతూ వరదనీరు ప్రవహిస్తుండటంతో నదికి జలకళ సంతరించుకుంది. కాగా మండల పరిధిలోని తుంగభద్ర తీర ప్రాంత గ్రామాల్లో రైతులు ముందస్తు పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఆర్డీఎస్ జలకళ

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలో రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్టపై తుంగభద్ర నది జలకళ సంతరించుకుంది. మండలంతో పాటు నదీతీర పై ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వర్షపు నీరు నదికి చేరుకున్నాయి. దీంతో ఆర్డీఎస్ ఆనకట్టపై రెండు అడుగుల మేర ఎత్తులో ఎక్కి దిగువ ప్రాంతం కర్నూలు వైపు ప్రవహిస్తోంది. ముందస్తు వర్షాలు కురిసి నది పుష్కలంగా ప్రవహించడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి కూలిన బ్రిడ్జి



కూలిన లక్ష్మీపురంలోని బ్రిడ్జి

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని గంజివాగు బ్రిడ్జి కూలిపోయింది. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లక్ష్మీపురం గ్రామంలోని గంజివాగుపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో రైతులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు గ్రామంలో పర్యటించారు. గంజివాగుపై కూలిన బ్రిడ్జితోపాటు గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు.

బెస్తలకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలి



సంఘీభావం వ్యక్తం చేస్తున్న బెస్త నాయకులు

కర్నూలు(అర్బన్): బెస్తలకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలని అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర కోకన్వీనర్ టి.సాయిప్రదీప్ కోరారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్ సమీపంలోని డాక్టర్ బ్రాహ్మరెడ్డి ప్రజా వైద్యశాల సమావేశ భవనంలో బెస్త ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ముందుగా భగవాన్ శ్రీ వ్యాస మహర్షి చిత్ర పటానికి నేతలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రదీప్ మాట్లాడుతూ బెస్తలు రాజకీయ పదవులకు నోచుకోవడం లేదన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రావాల్సిన రాజ్యాంగపరమైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు కోల్పోయినా, కనీసం రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల్లోనూ బెస్తలకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. త్వరలో ప్రకటించనున్న మార్కెట్‌యార్డు, దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్లు, ఇతర పదవుల్లో బెస్తలను నియమించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు భాస్కర్‌రావు, ఉదయ్, పీజీ వెంకటేష్, ఆనంద్‌రాజు, జయన్న, ఎద్దుల వెంకటేశ్వర్లు, గ్యాస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులకు ఆదరణ కరువు

- గత ప్రభుత్వంలో కౌలు రైతులకు పెద్దపీట
- కూటమి ప్రభుత్వంలో లక్ష్యం బారెడు.. చేరుకున్నది మూరెడు

కర్నూలు(అగ్రికల్చర్): 2019-20 నుంచి 2023-24 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలుదారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సాగుదారుల అభ్యున్నతి లక్ష్యంగా 2019లో నూతన కౌలుదారు చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా అర్హులైన సాగుదారులకు సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్)కార్డులు జారీ చేసింది. వీటిని పొందిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా తదితర సదుపాయాలు అందేవి. కూటమి ప్రభుత్వం సాగుదారుల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి సీసీఆర్ కార్డుల జారీ కోసం మే 1 నుంచి 15వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించారు. అయితే వ్యవసాయ పథకాలు అమలు చేయకపోవడంతో జిల్లాలో కౌలుదారులు భారీగా ఉన్నప్పటికీ సీసీఆర్ కార్డులు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. 2024-25లో 23,450 మంది సాగుదారులకు కార్డులు జారీ అయినా కేవలం 186 మంది సాగుదారులకు మాత్రమే రూ.1.92 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇతరత్రా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. కూటమి ప్రభుత్వంలో సీసీఆర్ కార్డులు పొందడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేనదే ఉద్దేశంతోనే ఈసారి కౌలుదారులు ముందుకు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2025-26 సంవత్సరంలో 25,000 సీసీఆర్ కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం విధించుకున్నప్పటికీ కేవలం 383 మంది సాగుదారులకు మాత్రమే అందజేశారు. ఉపయోగం లేని కార్డులను పొందడం ఎందుకనే ప్రశ్న కౌలు రైతులు బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన టిప్పర్



కాలువలో పడిన టిప్పర్

మద్దికెర: మండలంలోని బురుజుల వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరుగుతున్నాయి. బుధవారం కాలువ వెంబడి మట్టిని తరలిస్తుండగా అదుపుతప్పి టిప్పర్ కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికులు స్పందించి వెంటనే డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స కోసం గుంతకల్లు వైద్యశాలకు తరలించారు.

వినిపిస్తుందో లేదో మిషన్ నిర్ధారిస్తుంది



బేరా టెస్ట్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో చెవుడు...మూగ సమస్యతో బాధపడుతుంటారు కొందరు. ఇలాంటి వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడియోమెట్రి పరీక్షలు నిర్వహించి వినికిడి సామర్థ్యాన్ని నిర్ధారిస్తారు. ఇప్పటివరకు ఈ యంత్రాన్ని అమరిస్తే వినిపిస్తుందా లేదా అని రోగి సంజ్ఞలు చేస్తే దానిని బట్టి నివేదికలు ఇచ్చేవారు. దీనిని ఆసరగా చేసుకుని కొందరు ఎలాంటి సమస్య లేకపోయినా ఉన్నట్లు నటించి వికలాంగ సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ పథకాలు అందుకుంటున్నారు. ఇలాంటి వాటిని చెక్‌పెట్టేందుకు ఇప్పుడు బేరా పరీక్ష అందుబాటులోకి వచ్చింది. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈఎన్‌టీ విభాగం ఓపీ వద్ద ఏర్పాటు చేసిన బేరా పరీక్ష కేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ హెచ్‌వోడి డాక్టర్ వీరకుమార్ మాట్లాడుతూ బేరా పరీక్ష ద్వారా రోగికి వినిపిస్తుందా లేదా అన్నది మిషనే నిర్ధారిస్తుందన్నారు. సదరం సర్టిఫికెట్లతో పాటు వినికిడి లోపం, శ్రవణ నాడీ రుగ్మతలు, వినికిడిని ప్రభావితం చేసే నాడీ సంబంధిత పరిస్థితులను నిర్ధారించడంలో ఈ బేరా టెస్ట్ మిషన్ సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాలనాగాంజన్, ఈఎన్‌టి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చిన్న లింగన్న, డాక్టర్ మమతాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్

- 16 మోటార్ బైక్‌లు స్వాధీనం



అరెస్ట్ చేసిన దొంగను, పట్టుబడిన బైక్‌లను చూపిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: గత కొంత కాలంగా మోటార్ బైక్‌ల దొంగతనమే తన ప్రవృత్తిగా మార్చుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగ నుంచి 16 మోటార్ బైక్‌లను రికవరీ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ అవరణలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ మధుసుధన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించినట్లు చెప్పారు. సి.బెళగల్ మండలం పొలకల్ బీసీ కాలనీకి చెందిన ఉప్పరి వీరేష్, అదే గ్రామానికి చెందిన వర్ధన్ అలియాస్ ఇక్బాల్, కోడుమూరుకు చెందిన అబ్దుల్ కలామ్ అలియాస్ మచ్చాలు ముఠాగా ఏర్పడి మోటార్ బైక్‌ల చోరీలకు చేయటం మొదలు పెట్టినట్లు చెప్పారు. మీరి ముగ్గురిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 11 , కర్నూల్ -2 టౌన్‌లో 2, కర్నూల్ తాలూకా స్టేషన్లో 1, సి. బెళగల్ స్టేషన్లో 1, కర్నాటక రాష్ట్రం బళ్లారి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్లో 1 చొప్పున కేసులు ఉన్నాయన్నారు. ఏ1 నిందితుడు ఉప్పర వీరేష్ పట్టణంలోని మంత్రాలయం రోడ్ ఉప్పర కాలనీ కొట్టాల దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సమాచారం రావటంతో వెళ్లి పట్టుకొన్నట్లు చెప్పారు. విచారణలో మోటార్ బైక్‌లను దొంగతనం చేసినట్లు అంగీకరించటంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. బైక్‌ల కేసులో ఇప్పటికే కోడుమూరుకు చెందిన అబ్దుల్ కలాం అలియాస్ మచ్చా కర్నూల్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని, మరో నిందితుడు సి. బెళగల్ వర్ధన్ అలియాస్ ఇక్బాల్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన 16 మోటార్ బైక్‌ల విలువ రూ. 16.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

నాటుసారా స్వాధీనం



సారా, ద్విచక్ర వాహనాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: ఎక్సైజ్ అధికారులు 55 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తన సిబ్బందితో కాల్వ గ్రామ సమీపంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గుడుంబాయి తండాకు చెందిన మాలవత్ ధను నాయక్ ద్విచక్ర వాహనంపై 40 లీటర్ల సారా తీసుకెళ్తూ ఎక్సైజ్ అధికారులను చూసి బైక్, 40 లీటర్ల సారాను వదిలేసి పారిపోయారు. సారాతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కర్నూలు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ధను నాయక్ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. గుమ్మితం తండాలో నాటుసారా బట్టీలపై దాడులు జరిపి వార్తే వీరాంజనేయ నాయక్ వద్ద 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి జైలుకు పంపారు. దాడుల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ నవీన్‌బాబు, కానిస్టేబుళ్లు మురహరి రాజు, మధు, రామలింగయ్య, ఈరన్న, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



మేఘం.. దివి నుంచి భువికి!

ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. నింగి నుంచి భువికి దిగివచ్చాయి. పుడమితల్లికి నీడ పట్టాయి. ఎండలతో అల్లాడిన ప్రజలకు కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడింది. ఈక్రమంలో బుధవారం గడివేముల మండలం పెసరవాయి గ్రామ సమీపంలో మేఘాలు ఆకాశం నుంచి భూమిపైకి వచ్చినట్లు కనిపించిన దృశ్యం కనువిందు చేసింది.

– గడివేముల

'అనకొండ'పై దర్యాప్తునకు కమిటీ నియామకం

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేసి రిటైర్డ్ అయిన చాంద్‌బాషా పెద్ద మొత్తంలో ప్రభుత్వ నిధులను దారి మళ్లించిన విషయం తెలిసిందే. 2017 - 2018 నుంచి 2024-2025 ఆర్థిక సంవత్సరాలలో రూ.352.94 లక్షలను చాంద్‌బాషా వేరే అకౌంట్లకు మళ్లించినట్లు ఉన్నతాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈక్రమంలో సమగ్ర దర్యాప్తు జరిపి సాక్ష్యాధారాలు సేకరించేందుకు రాష్ట్ర అటవీదళాల అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ది ఫారెస్ట్స్ అజయ్‌కుమార్ నాయక్ ఆరుగురితో కమిటీని నియమించారు. కమిటీలో బీపి కృష్ణమూర్తి(ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ నంద్యాల), ఎస్ శివకుమార్ (డీఎఫ్ఓ విజిలెన్స్ - 2 హెడ్ ఆఫీస్ మంగళగిరి), ఐ పద్మావతి (అకౌంట్స్ ఆఫీసర్ ప్రాజెక్ట్ టైగర్, నంద్యాల సర్కిల్), ఏ చంద్ర శేఖరరాజు (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ప్రాజెక్ట్ టైగర్, ఆత్మకూరు డీడీఆఫీస్), జీఎస్ రవికుమార్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ప్రాజెక్ట్ టైగర్ నంద్యాల డీడీ ఆఫీస్), రమేష్ (సీనియర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ టైగర్, నంద్యాల డీడీ ఆఫీస్) ఉన్నారు. కాగా చాంద్‌బాషా ఆత్మకూరు డీడీ కార్యాలయంలో పని చేసిన 15 ఏళ్లలో కేవలం 8 ఏళ్ల రికార్డులను మాత్రమే ఈ కమిటీ పరిశీలన జరిపితే అంతకుముందు సమాచారం తెలిసే అవకాశం ఉండదని, 15 ఏళ్ల రికార్డులను తనిఖీ చేస్తేనే పూర్తి స్థాయి అవినీతి బయటపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సీఐపై దాడి కేసులో ఏడుగురికి జైలు, జరిమానా



శిక్ష పండిన ముద్దాయిలు

కర్నూలు: స్థానిక బంగారుపేటలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలోని ఆక్రమణల తొలగింపు సమయంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ పార్థసారధిరెడ్డిపై దాడి చేసిన ఏడుగురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2021 నవంబర్ 30న అక్రమ కట్టడాలను తొలగించేందుకు బందోబస్తుగా అప్పటి రెండో పట్టణ సీఐ పార్థసారధిరెడ్డి, కోడుమూరు సీఐ శ్రీధర్ సిబ్బందితో బంగారుపేటలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తుండగా కొంత మంది రాళ్లతో పోలీసులపై దాడి చేయగా సీఐకి గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స అనంతరం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. బంగారుపేటకు చెందిన లక్ష్మి, నీలిషికారి బెల్కీ, ఎన్.నరసింహులు, నీలిషికారి సుగుణ, ప్రసాద్, నీలి షికారి నాగమణి, నీలిషికారి బెగినిలపై అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రేపటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్ పో

కర్నూలు (టౌన్): ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్ పోను మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నట్లు క్రెడాయ్ కర్నూలు చైర్మన్ గోరంట్ల రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితా, బొగ్గు ల దస్తగిరి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మేయర్ బీవై.రామ య్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు పాల్గొంటారన్నారు. ప్రాపర్టీ షోలో 60 మంది బిల్డ ర్లు, నిర్మాణ వస్తువుల సరఫరాదారులు, ఇంటీరియర్ డిజైనర్లు పాల్గొంటారన్నారు. ప్రధాన స్పాన్సర్‌గా రాగమయూరి బిల్డర్స్, కో స్పాన్సర్‌గా స్కందాన్షి ఇన్ ఫ్రా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆటో పెవిలియన్ అదనపు ఆకర్షణగా నిలుస్తుందని, క్రెడాయ్ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి టీపీవీ ప్రకాష్, ఇతర క్రెడాయ్ సభ్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఆర్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో బుధవారం ఐదుగురు డిబార్ అయినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు 7,498 మందికి గానూ 6,769 మంది హాజరు కాగా 729 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కోసిగి ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో నారాయణ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు, కర్నూలు సెయింట్ జోసప్స్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు, డోన్ సాయిశ్రీ డిగ్రీ కళాశాల కేంద్రంలో జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు, ఎమ్మిగనూర్ రావూస్ డిగ్రీ కళాశాల కేంద్రంలో శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలకు చెందిన ఒక విద్యార్థి చూచిరాతకు పాల్పడుతుండగా గుర్తించి డిబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న రఫీక్ అహ్మద్

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లింపర్సనల్ లా బోర్డు రాష్ట్ర కన్వీనర్ రఫీక్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏక్యాంపులోని ఎంఎంఐ షాదీఖానాలో సయ్యద్ జాకీర్ మౌలానా రషీద్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, న్యాయవాది సుబ్బయ్య, అవాజ్ కమిటీ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, మైనార్టీ నాయకుడు షేక్ హఫీజ్, ఇలియాజ్, సమాచారహక్కు నాయకులు జయన్న, ఎమ్మార్పీఎస్ నాయకుడు కిరణ్, కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జ్ అమానుఉల్లా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 25 మానవహారం, 27న ఎస్టీబీసీ కళాశాలలో బహిరంగ సభ నిర్వహిస్తామని, జూన్ 3న మహిళలతో సమావేశం ఉంటుందని తెలిపారు.